క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలతో అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

తిరుమల: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని తిరుపతి అగ్నిమాపక అధికారులు గురువారం మహతి ఆడిటోరియం వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాలు రెండో రోజు భాగంగా బస్టాండ్ వద్ద కరపత్రాలు పంచి, మంటలు సంభవిస్తే ఎలా ఆర్పాలని అవగాహన కల్పించారు. ఇందులో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాలి



వీసీని సన్మానిస్తున్న అధ్యాపకులు, అక్షయక్షేత్రం ప్రతినిధులు

తిరుపతి సిటీ: మానసిక బుద్ధి మాంద్యంతో బాధపడే పిల్లల లక్షణాలను కనుగొని చికిత్సపై వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని మహిళా వర్సిటీ వీసీ డి.భారతి విద్యార్థినులకు సూచించారు. గురువారం స్థానిక మహిళా వర్సిటీలో మానసిక బుద్ధిమాంద్యం పాఠశాల టీచర్లకు, ఎంఎస్‌డబ్ల్యూ, స్పెషల్ బీఎడ్ విద్యార్థినులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం వర్సిటీ అధ్యాపకులు, అక్షయ క్షేత్రం బుద్ధిమాంద్యం పాఠశాల టీచర్లు వీసీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నందిని, అక్షయక్షేత్రం డైరెక్టర్ అన్నపూర్ణ, డీఎస్ వాణి, ఐవీ లలితకుమారి, తులసి, మల్లేశ్వరమ్మ, వజహాబాను, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత మన వారసత్వ సంపద



విద్యార్థినులతో వీసీ డి.భారతి

తిరుపతి సిటీ: చేనేత మన వారసత్వ సంపద అని, ఫ్యాషన్ షోలో చేనేత వస్త్రాలను ప్రదర్శించడం అభినందనీయమని వీసీ డి.భారతి పేర్కొన్నారు. గురువారం స్థానిక మహిళా వర్సిటీలో ఫ్యాషన్ టెక్నాలజీ యూజీ ఫస్టియర్ విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో భాగంగా చేనేత వస్త్రాలను ధరించి వాటి ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ధరించి భావితరాలకు చేనేత వస్త్ర ప్రాముఖ్యతను వర్సిటీ విద్యార్థులు తెలయజేయడం శుభపరిణామమన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో చేనేత వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించాలన్నారు. అనంతరం చేనేత వస్త్ర ధారణతో ముస్తాబయిన విద్యార్థినులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.బిందు, రఫియా సుల్తానా, టి.దేవి, కె.హబీబుల్లా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొంగే దొంగ... దొంగ.. అన్నట్టుంది



మాట్లాడుతున్న ఆరే అజయ్‌కుమార్

తిరుపతి కల్చరల్: ఆర్థిక దోపిడీకి అలవాటు పడి పదవులను అడ్డుపెట్టుకుని అవకాశ వాద రాజకీయాలతో రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ చేస్తున్న విమర్శలు చూస్తే దొంగే దొంగ... దొంగ అని అన్నట్టు ఉందని వైఎస్ఆర్ సీపీ యువజన విభాగం నేతలు ఎద్దేవా చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆరే.అజయ్‌కుమార్, పసుపులేటి సురేష్ కూటమి నేతలు దుర్మార్గపు విమర్శలను ఎండగట్టారు. గతంలో 600 పైగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అధికారంలోకి రాగానే బుట్టదాఖలు చేసి దగా చేసిన నీచపు చరిత్ర చంద్రబాబుదన్నారు. సుదీర్ఘ పాదయాత్రతో ప్రజా కష్టాలు తెలుసుకుని నవరత్నాలను ప్రతి ఇంటికి అందించి ప్రజా సంక్షేమ సారథిగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఖ్యాతి గడించారన్నారు. అన్న క్యాంటీన్ తొలగించడమే దాడికి కారణమని టీడీపీ నేత బోండా ఉమా చెప్పడం చూస్తే దాడి విషయం ఆయనకు ముందే ఎలా తెలుసు అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ సీపీ యువజన విభాగం నేతలు కార్తీక్, నీరజ్‌యాదవ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి

తిరుపతి రూరల్: తమిళనాడులో ఓటు హక్కు కలిగి ఉన్న కార్మికులకు శుక్రవారం వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బాలునాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్మిక శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం తమిళనాడులో లోక్‌సభ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలియజేశారు. ఈ ఉత్తర్వులను అమలు చేయని పరిశ్రమలు, ఇతర కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

అభివృద్ధి చేస్తా... ఆదరించండి

- ఈశాన్యం నుంచి ఇంటింటా ప్రచారం
- 50వ డివిజన్ భూపాల కాలనీలో తొలి ప్రచారం
- ప్రజల నీరాజనాలు అందుకున్న అభినయ్‌రెడ్డి
- తల్లిదండ్రుల నుంచి ఆశీర్వాదం అందుకున్న అభినయ్



కర్పూర హారతులతో స్వాగతం పలుకుతున్న స్థానిక మహిళలు



గుమ్మడికాయతో దిష్టి తీస్తున్న స్థానికులు

తిరుపతి అర్బన్: తిరుపతిలో అభివృద్ధి చేసి చూపుతా... అంతా ఆదరించండి అంటూ వైఎస్ఆర్ సీపీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన తమ నివాసంలో తల్లి భూమన రేవతి, తండ్రి స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నుంచి ముందుగా ఆశీస్సులు అందుకున్నారు. తిరుపతి తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్న అనంతరం సెంటిమెంట్‌గా నగరంలోని ఈశాన్యం ప్రాంతంలోని 50వ డివిజన్ పరిధిలో భూపాల కాలనీలో ఇంటింటా ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనపై అభిమానంతో నీరాజనాలు పలికారు. కొందరు మహిళలు కర్పూర హారతులతో స్వాగతం పలికారు, మరికొందరు గుమ్మడికాయలతో దిష్టి తీశారు. ఇంకొందరు విజయం నీదే అంటూ వీరతిలకం దిద్దారు. ఈ క్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి గత ఐదేళ్లలో తమ తండ్రి, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తిరుపతి నగరాభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. డెప్యూటీ మేయర్ హోదాలో తాము ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఉండడం కోసం నిర్మించిన 20 మాస్టర్ ప్లాన్ రోడ్లను గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో మే 13వ తేదీన జరగనున్న పోలింగ్ రోజు మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుకు వేసి తమను అఖండ విజయంతో గెలిపించాలని కోరారు. తప్పకుండా తమకు ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే తిరుపతి నగరాన్ని మరింత అభివృద్ధి చేసి, మెట్రో నగరాలైన చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తరహాలో తిరుపతిని అభివృద్ధి చేస్తామని వివరించారు. స్థానికుడైన తాను ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని వెల్లడించారు. స్థానికేతరులు అందుబాటులో ఉండరని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. కులాలు, మతాలు, పార్టీలకు సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా అందరికి సంక్షేమ ఫలాలు అందిస్తామని తమకు అవకాశం కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు అనిల్‌కుమార్, ఆదం రామకృష్ణారెడ్డి, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.






తిరుపతిలోని 50వ డివిజన్ భూపాలకాలనీ నుంచి ఇంటింటి ప్రచారం ప్రారంభించిన వైఎస్ఆర్ సీపీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి

నామినేషన్ వేయడానికి వెళుతున్న భూమన అభినయ్‌కి ఎదురుగా వస్తున్న తల్లి రేవతి



భూమన అభినయ్ తొలి నామినేషన్

- అత్యంత సాధారణంగా వెళ్లి నామినేషన్ దాఖలు
- అడంబరాలకు తాను దూరమని చాటిచెప్పిన అభినయ్
- మొత్తం పది నామినేషన్లు దాఖాలు



కుమార్తె, కుమారుడు నుంచి నామినేషన్ పత్రాలు అందుకుంటున్న భూమన అభినయ్

తిరుపతి తుడా: సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఘట్టం గురువారం మొదలైంది. తిరుపతి అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో తిరుపతి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అదితి సింగ్ నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. తొలిరోజే వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా భూమన అభినయ్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతోపాటు మరో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. తొలి రోజు తొలి నామినేషన్‌ను అభినయ్‌రెడ్డి వేశారు. అత్యంత సాధారణంగా వెళ్లి ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఆడంబరాలకు తాను దూరమని చాటిచెప్పారు. 2019 ఎన్నికల సమయంలో భూమన అభినయ్ తండ్రి భూమన కరుణాకరరెడ్డి నలుగురు పారిశుధ్య కార్మికులతో వెళ్లి నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. అదే తరహాలో భూమన అభినయ్ నిరాడంబరంగా, మీడియాకు సైతం ముందస్తు సమాచారం ఇవ్వకుండా కేవలం రెండు కార్లలో నలుగురితో వచ్చి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

తొలిరోజు ఏడుగురు నామినేషన్లు

నామినేషన్ల ప్రక్రియలో తొలిరోజు ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. తిరుపతి నియోజకవర్గానికి సంబందించి వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా భూమన అభినయ్‌రెడ్డి తొలి నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా పెంచల ప్రసాద్, ఆర్.కృష్ణ చైతన్య, బండ్ల చంద్రశేఖర్, నవీన్ బ్యంగి, పి.సోమశేఖర్‌రెడ్డి, సోడిసెట్టి నరేష్ నామినేషన్‌లు వేశారు. ఇందులో ముగ్గురు రెండు సెట్లు చొప్పున నామినేషన్‌లు దాఖలు చేయడంతో తొలిరోజే మొత్తం 10 నామినేషన్లు వేశారు.

ఆర్భాటాలకు దూరం

ఆర్భాటాలకు దూరంగా, నిరాడంబరంగా భూమన అభినయ్‌రెడ్డి నామినేషన్ వేసేందుకు వచ్చారు. నగర మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, డిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్, అడ్వొకేట్ రామచంద్రారెడ్డిలతో కలిసి భూమన అభినయ్ నామినేషన్ వేశారు.



నామినేషన్ వేయడానికి వెళ్తున్న భూమన అభినయ్, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, లాయర్, పార్టీ నేత శేఖర్‌రెడ్డి



తిరుపతి అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వద్ద పటిష్టమైన పోలీస్ భద్రత

దగాకోరు రాజకీయాలకు చిరునామా చంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి నీలం బాలాజీ

- అధికారం కోసం కూటమితో బాబు, పవన్ కుయుక్తులు
- బలిజ జేఏసీ కన్వీనర్ నీలం బాలాజీ ధ్వజం

తిరుపతి కల్చరల్: నమ్మించి నట్టేట ముంచే దగాకోరు రాజకీయాలు నడపడం చంద్రబాబునాయుడికి నిత్యకృత్యమని, అధికారం కోసం కూటమితో జతకట్టి ప్యాకేజీ పవన్‌తో మరోమారు ప్రజల్ని మభ్యపెట్టి రాజకీయ పబ్బం గడుపుకునే కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని వైఎస్ఆర్ సీపీ నేత, బలిజ జేఏసీ కన్వీనర్ నీలం బాలాజీ తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రస్తుతం రాష్ట్రంలో దుష్టకూటమి కుటిల రాజకీయ ఎత్తులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నత వర్గాలు, పేద వర్గాల మధ్య పోటీ సాగుతోందన్నారు. జగనన్న సంక్షేమ వెలుగుల్లో బతుకులు సాగిస్తున్న బడుగు, బలహీన వర్గాలు జగనన్న వెన్నంటి నిలిచి తమ సంక్షేమ దళపతి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. బాబు వస్తే జాబు వస్తుందని, నిరుద్యోగులకు 3 వేలు భృతి ఇస్తామని, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ అంటూ హామీలు గుప్పించిన చంద్రబాబు వాటిని విస్మరించి దగా చేశారన్నారు. జన్మభూమి కమిటీలతో అడుగడుగునా ప్రజల్ని వేధించి నట్టేట ముంచిన చరిత్ర బాబుదేనన్నారు. మళ్లీ ఎన్నికల వేళ మోసపూరిత హామీలతో ప్రజల్ని మభ్యపెట్టే చంద్రబాబును, పవన్ కల్యాణ్‌లు ప్రజాఛీత్కారానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో అశేష ప్రజాదరణతో జగనన్న విజయాన్ని, అభివృద్ధికి ఆద్యుడైన భూమన అభినయ్‌రెడ్డి అధిక మెజారిటీ గెలుపును దుష్టకూటమి కుతంత్రాలు అడ్డుకోలేవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ సీపీ నేతలు విజయలక్ష్మి, గల్లా కవిత, ఉషా, పద్మజ, అనిత, రాజేశ్వరి, రాధ, విజయ పాల్గొన్నారు.

రుయాలో అరుదైన శస్త్ర చికిత్స

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రుయా ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ క్రమంలో దాదాపు మూడు దశాబ్దాల తరువాత రుయాలో కార్డియాలజీ విభాగాన్ని పునః ప్రారంభించారు. డాక్టర్ కళ్యాణి రమ ఆధ్వర్యంలో కార్డియోథొరాసిక్ సేవలు ప్రారంభమయ్యాయి. ఒంగోలు జిల్లా, ఉలవపాడు గ్రామానికి చెందిన ఆనందబాబు(26) తీవ్ర అనారోగ్యంతో ఇటీవల రుయా ఆసుపత్రికి వచ్చాడు. కార్డియాక్ సర్జన్ డాక్టర్ కళ్యాణి రమ వివిధ వైద్య పరీక్షలు నిర్వహించగా ఆ యువకుడికి ఊపిరితిత్తుల్లో చీము గడ్డ ఉండడాన్ని గుర్తించారు. ఊపిరితిత్తుల్లో చీము గడ్డను తొలగించేందుకు లంగ్ డి కార్తికేసన్ అనే ఆధునిక విధానంతో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. సుమారు రూ.2 లక్షలకు పైగా ఖర్చు అయ్యే ఈ అరుదైన శాస్త్ర చికిత్సను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందించారు. అనస్తీషియా విభాగ అధిపతి డాక్టర్ రాధ, క్లినికల్ పర్ఫ్యూజనిస్ట్ చిరంజీవి శస్త్ర చికిత్సలో పాల్గొన్నారు. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, డాక్టర్ హరికృష్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బాధితుడితో శస్త్ర చికిత్స చేసిన వైద్యుల బృందం

దళితుల్ని అవహేళన చేసిన చరిత్ర టీడీపీదే...



దళిత నేత మల్లారపు మధు

తిరుపతి కల్చరల్: టీడీపీ హయాంలో అడుగడుగునా దళితుల్ని అవహేళన చేస్తూ దాడులు చేసిన చరిత్ర చంద్రబాబుదేనని వైఎస్ఆర్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు మధు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో దళితుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకునే నీచపు రాజకీయాలకు బాబు పాల్పడ్డారన్నారు. కులమతాలకు అతీతంగా సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ భావజాలంతో దళితుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారన్నారు. దళితులపై వివక్షత చూపిన చంద్రబాబు తన ఎల్లో మీడియాతో అసత్య రాతలు రాయిస్తే నమ్మే పరిస్థితిలో దళిత జాతి లేదన్న విషయాన్ని గుర్తించాలన్నారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీరామ నవమి రోజు కల్యాణం, ఆ మర్నాడు అంటే దశమి రోజున శ్రీరామ పట్టాభిషేకం జరిపించడం ఆనవాయితీ. ఆలయం ముందు ఏర్పాటు చేసిన మండపంలో శ్రీరామ పట్టాభిషేకం కనుల విందుగా జరిగింది. సీతా సమేతంగా శ్రీరాముడికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామ అర్చన నిర్వహించారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



శ్రీసీతారాముల కల్యాణానికి విచ్చేసి అధికారులు, భక్తులు



శ్రీసీతారాముల కల్యాణం చేపడుతున్న అర్చక పండితులు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో గురువారం రాత్రి శ్రీసీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండుగగా సాగింది. సర్వాంగ సుందరంగా అలంకరించిన మండపానికి స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని చేపట్టారు. ఆగమ పండితులు సీతారామాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ ఘట్టం సాగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై శ్రీసీతారాముల కల్యాణాన్ని తిలకించారు. ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో దుర్గరాజు, సూపరింటెండెంట్ సోమశేఖర్ పాల్గొన్నారు.

ముత్యాల తలంబ్రాలు ఊరేగింపు

శ్రీకోదండరామాలయంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం ముత్యాల తలంబ్రాల ఊరేగింపు వేడుకగా చేపట్టారు. ముందుగా టీటీడీ పరిపాలనా భవనంలోని ఖజానా విభాగంలో టీటీడీ అధికారులు ముత్యాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముత్యాలను ఏనుగు అంబారీపై ఊరేగింపుగా తీసుకొచ్చి శ్రీకోదండరామాలయ ప్రధాన అర్చకుడు ఆనందకుమార్ దీక్షితులకు అందించారు.



శ్రీకోదండరామాలయానికి ముత్యాల తలంబ్రాలను అంబారీపై ఊరేగింపు



బొమ్మగుంటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి, మేయర్ శిరీష, విజయా రాయల్



వైఎస్ఆర్ విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి

క్లుప్తంగా

లక్ష్మమ్మ పార్థివ దేహానికి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి నివాళి



లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి: కొటాల పంచాయతీ పాండురంగవారి పల్లి హరిజనవాడకు చెందిన లక్ష్మమ్మ(75) పార్థివ దేహానికి యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గురువారం నివాళులర్పించారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మమ్మ మంచాన పడింది. ఈ క్రమంలో ఆమె ఆరోగ్యం మరింత క్షీణించడంతో మృతి చెందింది. సమాచారం అందుకున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గ్రామానికి చేరుకుని లక్ష్మమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ గంగులమ్మ మునికృష్ణ, ఎంపీటీసీ మధు, మురళీ నాయుడు, పంచాయతీ అధ్యక్షుడు విరుపాక్షి ప్రసాద్‌రెడ్డి తదితరులున్నారు.

మొదటి రోజు ఒకే నామినేషన్

తిరుపతి రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మొదటి రోజు గురువారం వెంకటమణీప్రసాద్ ఒక్కరు మాత్రమే నామినేషన్ వేశారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నిషాంత్‌రెడ్డి నామినేషన్‌ను స్వీకరించారు.

ఉపాధి పనులు ఆకస్మిక తనిఖీ



దుర్గసముద్రంలో ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఏపీడీ పద్మలత

తిరుపతి రూరల్: మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా ఏపీడీ పద్మలత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుర్గసముద్రంలో పనులు జరుగుతున్న ప్రాంతానికి ఆమె వెళ్లారు. వేసవి నేపథ్యంలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఓఆర్ఎస్‌లు తెప్పించి ఇస్తున్నట్లు కూలీలు తెలిపారు. ఎండల విపరీతంగా ఉన్న నీడగా టెంట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ ఆదెం మురగారెడ్డిని ఆదేశించారు. ప్రతి కూలీకి 300 రోజుల పనిదినాలను కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన కూలీలకు సరాసరి 160 పనిదినాలు కూడా కల్పించకపోవడంపై ప్రశ్నించారు. పనులకు కూలీలు రావడం లేదని ఎఫ్ఏ చెప్పడంతో పంచాయతీ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, వారికి ఉపాధి పనులతో కలిగే ప్రయోజనాలను వివరించాలని ఏపీడీ పద్మలత సూచించారు. అవసరమైతే తాను కూడా ఈ సమావేశాలకు హాజరవుతానని చెప్పారు.

సోషల్ జస్టిస్ ఫోరం అధ్యక్షుడిగా ప్రేమ్‌కుమార్



తిరుపతి రూరల్: సోషల్ జస్టిస్, లీగల్ రైట్స్ ఫోరం చంద్రగిరి నియోజకవర్గ అధ్యక్షుడిగా దామరపాటి ప్రేమ్‌కుమార్‌చౌదరి నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం జాతీయ అధ్యక్షుడు నరేష్‌బాబు నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఏడాదిపాటు ఆయన ఈ పదవిలో ఉంటారని పేర్కొన్నారు. యువత, చిన్నపిల్లలు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, మహిళలు, సాధారణ ప్రజల న్యాయ హక్కుల పరిరక్షణ కోసం ప్రేమ్‌కుమార్ కృషి చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం సీమల్లవరం పంచాయతీకి చెందిన ప్రేమ్‌కుమార్ ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలతో మండల ప్రజలకు సుపరిచితుడు. అధ్యక్షుడిగా నియమించిన ఫోరం నాయకులకు ప్రేమ్‌కుమార్‌చౌదరి కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ఆదరించండి



సీగొల్లపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమంతోపాటు సేవా కార్యక్రమాలతో ప్రజలను సొంత కుటుంబ సభ్యులుగా భావించే చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కోరారు. తిరుపతి రూరల్ మండలంలో సీగొల్లపల్లి పంచాయతీలో గురువారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కరపత్రాలను అందించి అభ్యర్థించారు. ఈ సందర్భంగా హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ ఊహించని రీతిలో గత నాలుగున్నర ఏళ్లలోనే రూ.1084 కోట్ల నిధులతో అభివృద్ధి పనులను చేసి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చరిత్ర సృష్టించారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించిన ఘనత చెవిరెడ్డిదన్నారు. విదేశాల్లో ఉన్నత చదువులను పూర్తి చేసుకుని ప్రజాసేవ కోసం వచ్చిన మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, సర్పంచ్ రవి, చొక్కారెడ్డి జగదీష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నా ప్రతి అడుగూ... ప్రజా సేవ కోసమే..

- నాన్న అడుగుజాడల్లో నడుస్తా.. అంకితభావంతో పనిచేస్తా..
- మీ ఇంటి బిడ్డగా ఆదరించండి.. అందుబాటులో ఉంటాను
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమాభివృద్ధి పాలన
- తుడా ఛైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వెల్లడి
- తిరుమలనగర్‌లో జోరుగా ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హాజరైన జనం



బైక్ ర్యాలీలో యువతతో పాటు...

తిరుపతి మంగళం: నా ప్రతి అడుగు ప్రజా ప్రయోజనాల కోసమే వేస్తా.. అంకిత భావంతో ప్రజాసేవకు సంకల్పిస్తానని తుడా ఛైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. నాన్న అడుగుజాడల్లో నడుస్తా.. అంకితభావంతో ప్రజాసేవకు సంకల్పిస్తానని స్పష్టం చేశారు. గురువారం తిరుమలనగర్‌లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఏడు కిలోమీటర్ల మేర యువత బైక్ ర్యాలీతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. హరిత కాలనీ నుంచి జయశంకర్ కాలనీ వరకు జై జగన్, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నాయకత్వం.. వర్ధిల్లాలి అంటూ.. నినాదాలతో హోరెత్తించారు. జయశంకర్ కాలనీలో ఇంటింటి ప్రచారంలో ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. హారతులు పట్టి ఆప్యాయత చూపారు. పూల వర్షం కురిపిస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రతి గడపలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. కరపత్రాలు పంచుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. తిరుమలనగర్‌లోని ముత్యాలమ్మ గుడి వద్ద బహిరంగ సమావేశంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గడిచిన యాభై సంవత్సరాల కాలంలో జరగని విధంగా చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధిని పరుగులు పెట్టించామన్నారు. ఇదంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతోనే సాధ్యమైందన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుందన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి పరిమితం కాకుండా ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య సురక్షను అమలు చేశారని వివరించారు. ఆరోగ్య శ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలకు అవకాశం కల్పించారని తెలిపారు. ప్రతి ఇంటికి పెద్ద కొడుకుగా అన్ని రకాలుగా ఆదుకుంటున్నారని తెలియజేశారు.

మీ ఇంటి బిడ్డగా ఆదరించండి..

సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ఎమ్మెల్యేగా ఎదిగిన తన తండ్రి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనకు స్ఫూర్తిదాయకం అని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధన కోసం ఆయన నిరంతరం పరితపించారన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ అంకితభావంతో ప్రజా సేవకు సంకల్పిస్తానని వెల్లడించారు. చంద్రగిరి నియోజకవర్గం నుండి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి సీఎం జగనన్నకు కానుకగా ఇచ్చేందుకు మీరంతా సిద్ధమా అంటూ ప్రశ్నించారు. ప్రజలు కూడా అంతే ఉత్సాహంతో సిద్ధం అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వకుళ, మంగళం డివిజన్ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, ఇన్‌చార్జి గుండ్రాజు శివశంకర్ రాజు, అధ్యక్షుడు మొదలియార్ రమేష్, ఉప సర్పంచ్ తిరుమల ప్రసాద్ బాబు, ఎంపీటీసీ శ్రావణ్ కుమార్, చిట్టి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవను బాధ్యతగా భావించాలి

- చెప్పింది చేయగలిగిన వారికే అండగా ఉంటాం
- అభివృద్ధిని పరుగులు పెట్టించాలి
- ఆపద సమయంలో ముందుండి నడిపించాలి
- విపత్కర పరిస్థితుల్లో పారిపోయిన వారిని నమ్మం
- చంద్రగిరి నియోజకవర్గ ఓటర్ల మనోగతం

తిరుపతి రూరల్: రాజకీయం అంటే వ్యాపారం కాదు... అది ఒక బాధ్యత. ప్రజలకు భరోసా కల్పించాలి. చెప్పింది చేయగలిగి, ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేర్చే వారికి అండగా ఉంటామంటున్నారు చంద్రగిరి ఓటర్లు. విపత్తులు సంభవించినప్పుడు, మహమ్మారి విజృంభించినప్పుడు ప్రాణాలను పణంగా పెట్టి ఆదుకున్నవారి మేలును మరవలేమని స్పష్టం చేస్తున్నారు. సమస్య వచ్చినప్పుడు పారిపోయేవారిని, ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటూ చుట్టపుచూపుగా నియోజకవర్గానికి వచ్చే విజిటింగ్ ఆర్టిస్టలను నమ్మలేమని చెబుతున్నారు. ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి, ప్రతి శుభకార్యంలో ఇంటికే కానుకలతో ఆత్మబంధువుగా వచ్చి పలకరించే నాయకులకు వెన్నంటి ఉంటామంటున్నారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు సేవా కార్యక్రమాలతో ఆత్మీయతను చాటే వారికే మా ఓటు... అంటూ చంద్రగిరి నియోజకవర్గ ఓటర్లు తమ మనోగతాన్ని ముక్తకంఠంతో వెల్లడిస్తున్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి వారికి ఓటు వేస్తారని అడిగితే... ఇవీ ఓటర్లు చెప్పిన మాటలు...

మాట మీద నిలబడే నాయకుడికే...



ఓట్ల సమయాల్లో మాత్ర మే ప్రజల్లోకి వచ్చి గెలిచిన తర్వాత ప్రజా సమస్యలు గాలికి వదిలేసే వా రికి ఓటు వేయం. విపత్తు వస్తే ప్రజల కోసం నిలబడే వారే నాయకులు. ప్రమాద సమయంలో రేయింబవళ్లు కష్టపడి సమస్యను పరిష్క రించి ప్రజలు సురక్షితం అని తెసుకున్న తర్వాతే అక్కడి నుంచి తన ఇంటికి వెళ్లే నాయకుడై ఉండాలి. మాట మీద నిలబడి ప్రజలకు ఇచ్చి న హామీలను నెరవేర్చే నాయకుడికే మా ఓటు.

– మోహన్‌రెడ్డి, కుప్పంబాదూరు, రామచంద్రాపురం మండలం

అండగా ఉండే నాయకుడికే నా ఓటు



పాకాల: నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ, అన్నింటికి నేనున్నా అంటూ భరోసా కల్పించే నాయకుడికే నేను ఓటు వేస్తాను. ఏ కష్టం వచ్చినా ఆదుకుంటూ అండగా ఉండే నాయకుడికి నేను మద్దతు ఇస్తాను. కరోనా సమయంలో ఆపదలో ఉన్న ప్రతీ ఒక్కరిని ఆదుకున్న నాయకుడికే ఓటు వేస్తాను. ఆపద సమయంలో ప్రజలను మరచిపోయి, చుట్టపు చూపుగా వచ్చిపోయేవారికి ఓటు వేయను. ప్రజలకు అందుబాటులో లేకుండా, కంటికి కనిపించకుండా పోయే నాయకులకు ఓటు వేయడం వృథా అవుతుంది.

– నాజున్నీసా, మొగరాల గ్రామం, పాకాల మండలం

ఇచ్చిన మాటపై నిలబడేవారికే నా ఓటు



ఇచ్చిన హామీని నెరవేర్చే నాయకుడు, మాటపై నిలబడే నాయకుడికే నేను ఓటు వేస్తాను. అభివృద్ధిపై దృష్టి సారించి రాష్ట్రా న్ని ఉన్నతంగా పరిపాలించిన నాయకులను మరచిపోకూడదు. ఎన్ని కష్టాలు వచ్చినా నేను న్నా అంటూ భరోసా కల్పించి మాట తప్పకుండా నాయకుడిపై విశ్వాసం చూపించాలి. తప్పుడు వాగ్దానాలు చేసి, ప్రజలను మోసం చేసే నాయకులకు నేను ఓటు వేయను. ఎన్నికల సమయంలో అవకాశం దక్కించుకునేందుకు బూటకపు హామీలు ఇచ్చే నాయకులను నేను నమ్మను.

– పి.తిరుమల(వెంకట్), చెన్నుగారిపల్లి, పాకాల మండలం

కష్టాల్లో ఆదుకున్న నాయకుడికే మా ఓటు



ప్రజలకు కష్టకాలంలో అన్నీ తానై ఆహారం, మందులు, మౌలిక వసతులు ఇప్పించి నేనున్నాని భరోసా ఇచ్చే నాయకుడై ఉండాలి. ఓట్లు కోసం గ్రామాల్లోకి వచ్చినప్పుడు సమస్యలను ప్రజలు చెప్పకముందే గుర్తించి గెలిచాక నేరవేర్చాలి. నిరంతరం ప్రజల కోసం తపించి వారి బాగోగులు పట్టించుకునే నాయకుడై ఉండాలి. ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి సేవ చేసే నాయకుడికే మా ఓటు వేస్తాం.

– చెంగల్రాయులు, మహంతువారిపల్లి, రామచంద్రాపురం మండలం

ఆత్మీయతను చాటే వారికే ఓటు...



చంద్రగిరి నియోజకవర్గానికి రా ష్ట్రం లోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కా ర్యక్రమాలతో ఆత్మీయతను చాటే వారికే ఓటు వేస్తాం. ఎక్కడో చిత్తూరులో ఉంటూ నియోజకవర్గానికి ఎప్పు డో ఒకసారి వచ్చే విజిటింగ్ ఆర్టిస్టలను నమ్మి ఓటు వే యలేం. ఇక్కడే ఉండి రాయలచెరువు ప్రమాదంలో ఉ న్నప్పుడు, కరోనా వంటి విషమ పరిస్థితుల్లో చిత్తూరు పారిపోయిన వారిని ఎలా నమ్ముతాం. విషమ పరిస్థితులు, ప్రమాద సమయాల్లో సైతం ప్రాణాలను పణంగా పెట్టి నేనున్నాను.... భయం వద్దు అంటూ భరోసా కల్పించిన నాయకుడికి అండగా ఉంటాం. అలాంటి వారికే ఓటు వేస్తాం. అప్పుడే నియోజకవర్గం ఇంకా అభివృద్ధిలో ముందుకు వెళ్తుంది.

– మహేంద్ర, మల్లంగుంట, తిరుపతి రూరల్

పనులు చేసేవారికే ఓటు



మంగళంలో గత 25 ఏళ్లుగా రాళ్ల తేలిన రోడ్లు, ఇళ్ల ముందు ఏరులై పారుతున్న మురుగునీరుతో తీవ్ర అవస్థలు పడ్డాం. నాలుగేళ్లల్లో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి మా కాలనీలలో జరిగింది. అన్నిచోట్లా సీసీరోడ్లు, మురుగు కాలువలు అద్భుతంగా నిర్మించారు. గత ప్రభుత్వాల్లో చిన్నపాటి సమస్య పరిష్కారానికి అధికారుల చుట్టూ తిరిగితిరిగి అలసిపోయేవాళ్లం. అయితే ఇప్పుడు అడక్కముందే సమస్యలను పరిష్కరించారు. మేం అడక్కపోయినా అభివృద్ధి చేసిన వారికే మద్దతుగా ఉంటాం. వారికే ఓటు వేస్తాం.

– వీరేశం, మంగళం సప్తగిరినగర్ పంచాయతీ

కష్ట కాలంలో ఆదుకునే వారు కావాలి



విపత్కర పరిస్థితుల్లో మా కటుంబాలకు అండగా ఉండే వారికే మేం మద్దతు ఇస్తాం. తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి అన్ని విధాలుగా మా ప్రాణాలను కాపాడిన నాయకులున్నారు. వారి రుణాన్ని ఓటుతో తీర్చుకుంటాం. కరోనా సమయంలో కుటుంబ సభ్యులే పట్టించుకోని రోజులు అవ్వి. అలాంటి రోజుల్లో మా బాగోగులు చూసిన వారికి తప్ప మరొకరికి ఓటు వేయం. మాట మీద నిలబడి ఇచ్చిన హామీలు నమ్మకంగా నెరవేర్చేవారికి నా ఓటు వేస్తాను.

– పార్వతమ్మ, మంగళం తిరుపతి రూరల్

మాటలు చెప్పేవారు కాదు... మంచి చేసే వారు కావాలి



ఎన్నికల సమయం దగ్గర పడడంతో మీకు అది చేస్తాం .. ఇది చేస్తాం.. అంటూ మాటలు చెప్పేవారిని కాకుండా, మంచి చేసేవారినే ఓటు ద్వారా ఎన్నుకుంటాం. విలువైన ఓటుకు ప్రాధాన్యత ఏ మాత్రం తగ్గించకుండా వినియోగించుకుంటాం. అధికారం ఉన్నా.. లేకపోయినా... నిత్యం ప్రజలతో మమేకమవుతూ మా యోగక్షేమాలను అడిగి తెలుసుకునే నాయకులే మాకు కావాలి. కుటుంబం అంతా నిత్యం ప్రజలతో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకునే నాయకుడుంటే ఆ నియోజకవర్గానికి ఇంకేం కావాలి. అలాంటి నాయకుడి ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నాను.

– కొడిదెల పద్మావతి, వెంకటంపేట, రాయలపురం పంచాయతీ, చంద్రగిరి మండలం

జనం మేలు కోరే నాయకుడు రావాలి



జనం మేలు కోరే నాయకుడే మాకు ప్రజాప్రతినిధి కావాలి. ఎన్నికల సమయంలో నోటికొచ్చి హామీలు ఇచ్చి ఆ తర్వాత జనం మొహం చూడని వాళ్లను ఎన్నుకోము. ఎవరు జనంతో ఉంటారో.. ఎవరు ఎన్నికల సమయంలో వస్తారో అందరికీ తెలుసు. ఈ కాలం జనం తెలివైన వాళ్లు. ఉత్తుత్తి హామీలను నమ్మరు. నోరు ఉంది కదా అని సాధ్యం కాని హామీలు ఇచ్చే వారు మాకు వద్దు. మాకు అండగా నిలిచే నాయకులను ఎన్నుకుని, మా ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుంటాం.

– రాజ, రాయలపురం, చంద్రగిరి మండలం

మంచి చేసేవారినే ఎన్నుకుంటాం



మా ఊరికి మా కుటుంబానికి మంచి చేసేవారినే ఎన్నుకుంటాం. మాకు ఏ సమస్య వచ్చినా మా వెంట నిలిచే నాయకుడు మాకు కావాలి. జనాన్ని కేవలం ఓటర్లు మాదిరిగా కాకుండా తమ కుటుంబ సభ్యులుగా చూసుకునే వారిని ఎన్నుకుంటే మా తరం.. తర్వాత తరం కూడా బాగుపడుతుంది. మంచి వారికి మామద్దతు ఎప్పటికీఉంటుంది.

– చిన్నవెంకట్రామయ్య, రైతు, మారసానివారిపల్లె, చిన్నగొట్టిగల్లు

నమ్మకమైన నాయకుడికే నా ఓటు



నమ్మకమైన నాయకుడికే ఈ ఎన్నికల్లో మా ఓటు వేస్తాం, వేయిస్తాం. ఇచ్చిన మాట నిలబెట్టుకునేవారు, ఇంటింటికీ సంక్షేమాన్ని అందించే నాయకుడికే ఓటు వేస్తాను. మాకు అండగా నిలిచినవారికి మంచి చేసే రోజు ఒక రోజు మాకూ వస్తుందనుకున్నాం. మే 13 జనం కోసం పరితపించే నాయకుడిని ఓటు వేస్తాం. ప్రజాస్వామ్యాన్ని బతికిస్తాం.

– మనోజ్, ఎర్రావారిపాళెం మండలం

జగనన్న పాలనలో సంక్షేమ వెలుగులు



ఫ్యాను గుర్తుకు ఓటేసి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గెలిపించాలంటూ అభ్యర్థిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

చంద్రగిరి: జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమ ఫలాలు .... గత ఐదేళ్లలో ఏ ప్రభుత్వం అందించని పథకాలు ఇచ్చి అన్ని కుటుంబాలను ఆదుకున్నారు.... ప్రతి ఇంటికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వ్యక్తిగత సేవా కార్యక్రమాలు చేశారు... అవన్నీ గుర్తుంచుకుని మోహిత్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని చెవిరెడ్డి లక్ష్మి విజ్ఞప్తి చేశారు. చంద్రగిరి మండలం రాయలపురం పంచాయతీ వెంకటంపేట, తొటిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురువారం చెవిరెడ్డి లక్ష్మి ప్రతి ఇంటికి జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కరోనా సమయంలో చెవిరెడ్డి కుటుంబ సభ్యులు చేసిన సాయం, సంక్షేమ పథకాలతో పొందిన లబ్ధిని గుర్తు చేశారు. రాయలపురం మహిళలు చెవిరెడ్డి లక్ష్మికి అపూర్వ స్వాగతం పలికి తమ మద్దతు తెలిపారు. తండ్రికి తగ్గ తనయుడిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జనం ముందుకు వచ్చారని, పెద్ద మనస్సు చేసుకుని గెలిపించాలని కోరారు. అధికారంలో ఉన్నా.. లేకపోయినా... కష్టం వచ్చినా... పండగ వచ్చినా... ఎలాంటి ఆపద వచ్చినా చంద్రగిరి ప్రజలకు చెవిరెడ్డి కుటుంబం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఆమె తెలిపారు. తమ కుటుంబ సభ్యుల కంటే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రజలను ఎక్కువగా చూసుకున్నారన్నారు. ఆయన చేసిన సేవకు రుణం తీర్చుకోవాలంటే ఆయన బిడ్డను ఎమ్మెల్యేగా చేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



హనుమంత వాహనంపై శ్రీరామచంద్రుడు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీరామ నవమి రోజు కల్యాణం, ఆ మర్నాడు అంటే దశమి రోజున శ్రీరామ పట్టాభిషేకం జరిపించడం ఆనవాయితీ. ఆలయం ముందు ఏర్పాటు చేసిన మండపంలో శ్రీరామ పట్టాభిషేకం కనుల విందుగా జరిగింది. సీతా సమేతంగా శ్రీరాముడికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామ అర్చన నిర్వహించారు. అనంతరం రాజదండం, రాజఖడ్గం, రాజ ముద్రిక ఒక్కొక్కటిగా స్వామివారికి అలంకరించారు. శ్రీరామచంద్రుడిని హనుమంత వాహనంపై ఊరేగించారు. శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని కళ్లారా తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జై శ్రీరామ్ అన్న నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి



బాలునాయక్

తిరుపతి రూరల్: తమిళనాడులో ఓటు హక్కు కలిగి ఉన్న కార్మికులకు శుక్రవారం వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బాలునాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్మిక శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం తమిళనాడులో లోక్‌సభ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేశారు. ఈ ఉత్తర్వులను అమలు చేయని పరిశ్రమలు, ఇతర కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.